సాక్షి ఆదిలాబాద్

బుధవారం । 12 । మార్చి । 2025

విజయోస్తు..



ఆదిలాబాద్‌టౌన్: పదో తరగతి పరీక్షలు రాసే విద్యార్థులకు కలెక్టర్ రాజర్షి షా విజయోస్తు లేఖలను రాశారు. జిల్లాలోని ఆయా ప్రభుత్వ యాజమాన్య పాఠశాలల్లో చదివే విద్యార్థులకు విద్యాశాఖ ద్వారా వీటిని పంపుతున్నారు. పరీక్షలు ప్రశాంతంగా రాయాలని ఆల్ ది బెస్ట్ తెలిపారు.



రంజాన్ వేళలు

ఇఫ్తార్	సహర్
బుధవారం: 6:21	గురువారం: 5:10

గరిష్ఠం/కనిష్ఠం
39.0/27.0

వాతావరణం

వాతావరణం పొడిగా ఉంటుంది. మధ్యాహ్నం ఎండతీవ్రత పెరగనుంది. ఉక్కపోత ప్రభావం కనిపిస్తుంది.

న్యూస్‌రీల్

'స్థానిక' ఎన్నికలపై దృష్టి సారించండి



మంత్రి సీతక్కతో ఉమ్మడి జిల్లా నాయకులు

కైలాస్‌నగర్: స్థానిక సంస్థల ఎన్నికలపై దృష్టి సారించాలని జిల్లా ఇన్‌చార్జి మంత్రి సీతక్క అన్నారు. కాంగ్రెస్ పార్టీ ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ముఖ్య నాయకులు, నియోజకవర్గ ఇన్‌చార్జీలతో మంత్రి హైదరాబాద్‌లోని తన క్యాంపు కార్యాలయంలో సోమవారం రాత్రి సమీక్ష నిర్వహించారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో అనుసరించాల్సిన కార్యాచరణపై వారికి దిశానిర్దేశం చేశారు. అన్ని నియోజవర్గాల్లో పార్టీని పటిష్టం చేయాలని, ప్రభుత్వ పథకాలను ప్రజల వద్దకు తీసుకెళ్లాలని సూచించారు. గ్రామ పంచాయతీ, మండల, జిల్లా పరిషత్, మున్సి పల్ ఎన్నికల్లో పార్టీ గెలుపునకు ఇప్పటినుంచే పక్కా ప్రణాళికతో ముందుకు సాగాలని సూచించారు. ఇందులో ఎమ్మెల్సీ దండే విఠల్, ఎమ్మెల్యేలు వెడ్మ బొజ్జు పటేల్, ప్రేమ్ సాగర్‌రావు, మాజీ కేంద్ర మంత్రి వేణుగోపాలాచారి, మాజీ ఎంపీ సోయం బాపూరావ్, పార్టీ నేతలు విఠల్‌రెడ్డి, రేఖానాయక్, సత్తు మల్లేశ్, ఆత్రం సుగుణ, శ్రీహరిరావు, గజేందర్, శ్రీనివాసరెడ్డి తదితరులున్నారు.

పీఆర్‌లో కారుణ్య నియామకాలు

- 25మందికి దక్కనున్న ఉద్యోగాలు

కైలాస్‌నగర్: జిల్లా పంచాయతీరాజ్ శాఖలో ఐదేళ్లుగా పెండింగ్‌లో ఉన్న కారుణ్య నియామకాలకు ఎట్టకేలకు మోక్షం లభించనుంది. విధి నిర్వహణలో మరణించిన ఆ శాఖ ఉద్యోగుల కుటుంబీకులకు ఈ నియామకాల కింద పోస్టింగ్ కల్పించాల్సి ఉంది. అయితే జిల్లాలో తగినన్ని జూనియర్ అసిస్టెంట్ పోస్టులు లేకపోవడంతో ఈ ప్రక్రియ నిలిచిపోయింది. దీంతో ఉద్యోగాల కోసం ఏళ్లుగా ఎదురుచూస్తున్న వారికి ప్రయోజనం కల్పించేలా రాష్ట్ర వ్యాప్తంగా 584 సూపర్ న్యూమరీ జూనియర్ అసిస్టెంట్ పోస్టులను క్రియేట్ చేస్తూ రాష్ట్ర మంత్రివర్గం ఇటీవల నిర్ణయం తీసుకుంది. అర్హులైన వారందరికీ పోస్టింగ్ కల్పించేలా తగు చర్యలు చేపట్టాలని జెడ్పీ సీఈఓలను ఆదేశించింది. ఈ మేరకు ఆదిలాబాద్ జిల్లాలో 25 మందికి ఉద్యోగాలు దక్కనున్నాయి. 27 మంది అర్హులు ఉండగా ఇద్దరికి ప్రభుత్వ ఉద్యోగాలు లభించాయి. ఒకరు స్కూల్ అసిస్టెంట్‌గా ఉద్యోగం సాధించగా, మరొకరికి జెడ్పీలోనే టైపిస్ట్‌గా ఉద్యోగం దక్కింది. మిగిలిన వారికి పోస్టింగ్ కల్పిస్తూ ఉత్తర్వులు సిద్ధం చేయాలని ప్రభుత్వం ఆదేశించినట్లుగా జెడ్పీ సీఈవో జి.జితేందర్ రెడ్డి తెలిపారు. వారికి రాష్ట్రస్థాయిలోనే సీఎం చేతుల మీదుగా నియామక పత్రాలు అందజేయనున్నట్లు వెల్లడించారు.

'ఎంపీ, ఎమ్మెల్యేలు రాజీనామా చేయాలి'



మాట్లాడుతున్న రామన్న

ఆదిలాబాద్‌టౌన్: సీసీఐ ఫ్యాక్టరీ, ఎయిర్‌పోర్టు విషయంలో స్థానిక ఎంపీ, ఎమ్మెల్యేలు పచ్చి అబద్ధాలు మాట్లాడుతున్నారని, చేతకాకపోతే రాజీనామా చేయాలని బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు జోగు రామన్న అన్నారు. జిల్లా కేంద్రంలోని ఆ పార్టీ కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సీసీఐ పరిశ్రమను తుక్కు కింద అమ్మేయడానికి టెండర్లు ప్రకటించిన విషయాన్ని బయట పెట్టడంతో దానిపై వారిద్దరు అవగాహన లేకుండా మాట్లాడుతున్నారన్నారు. ఎయిర్‌పోర్టు విషయంలో ఎంపీ చేసిన వ్యాఖ్యలు నిజమైతే తన స్వగ్రామమైన జాతర్లలోని శివాలయంలో ప్రమాణం చేయాలని సవాల్ విసిరారు. బీఆర్‌ఎస్‌పై లేనిపోని ఆరోపణలు చేస్తే సహించమన్నారు. తాను ప్రజాభిప్రాయానికి అనుగుణంగా అభివృద్ధి చేశానే తప్ప మోసపూరిత మాటలు చెప్పలేదని గుర్తు చేశారు. పరిశ్రమల విషయంలో యువతతో పాటు ప్రజలను తప్పుదోవ పట్టించేలా ఎంపీ, ఎమ్మెల్యే మాట్లాడుతున్నారన్నారు. అబద్ధాలతో కాలయాపన చేసే బదులు రాజీనామా చేయడం ఉత్తమమని హితబోధ చేశారు. 11 ఏళ్లుగా బీజేపీ కేంద్రంలో అధికారంలో ఉన్నా సీసీఐ పరిశ్రమను పునః ప్రారంభించకపోవడం వారి అసమర్థతే కారణమన్నారు. వాటి సాధన కోసం పార్టీ ఆధ్వర్యంలో ఆందోళనలు తీవ్రతరం చేస్తామన్నారు. ఇందులో నాయకులు నారాయణ, అజయ్, ప్రహ్లాద్, రాజు, భూమన్న తదితరులు పాల్గొన్నారు.



మున్సిపల్ ట్యాంకర్ ద్వారా నీటిని పట్టుకుంటున్న వీరు పట్టణంలోని భగత్‌సింగ్‌నగర్ వాసులు. ఈ కాలనీ దిగువ ప్రాంతంలో నల్లాలు, చేతిపంపులు లేకపోవడంతో వీరికి ట్యాంకర్ నీరే ఆధారం. ట్యాంకర్ రాక కోసం నిత్యం పడిగాపులు తప్పడం లేదని కాలనీవాసులు వాపోతున్నారు.



ఆదిలాబాద్ పట్టణంలోని 41వ వార్డు టీచర్స్ కాలనీలో మిషన్ భగీరథ పైపులైన్ లీకేజీ అయింది. మరమ్మతులు చేసేందుకు బల్దియా కార్మికులు ఇలా తవ్వకాలు చేపడుతున్నారు. పట్టణంలో నిత్యం ఏదో ఒక కాలనీలో ఇలాంటి పనులు చేపడుతుండడం గమనార్హం.



ఇంటింటా డ్రమ్ములతో కూడిన ఈ చిత్రం పట్టణంలోని సర్వే నంబర్ 170 కాలనీలోనిది. ఈ కాలనీలో సీసీ రోడ్డు, డ్రెయినేజీ నిర్మాణ పనులు చేపడుతుండటంతో పైపులైన్ పగిలి నీటి సరఫరా నిలిచింది. దీంతో కాలనీకి ట్యాంకర్ నీరే దిక్కయింది. నిత్యం రెండు ట్యాంకర్లతో 18 ట్రిప్పుల్లో సరఫరా చేస్తున్నారు. ఆ నీటిని స్థానికులు డ్రమ్ముల్లో నిలువ చేసుకుంటున్నారు.

వృథా అరికట్టకుంటే వ్యథే!

మున్సిపల్ పరిధిలో నీటి సరఫరాకు సంబంధించిన వివరాలు..
పట్టణంలోని వార్డులు : 49
జనాభా : 2,10,000
కుటుంబాలు : 48,393
ఇళ్లలోని నల్లా కనెక్షన్లు : 35,393
కమర్షియల్ కనెక్షన్లు : 18
పనిచేస్తున్న చేతిపంపులు : 843

- బల్దియా పరిధిలో 'భగీరథ' లీకేజీలు
- నిత్యం 8ఎంఎల్‌డీల వరకు నీరు వృథా
- మూడు కాలనీలకు ట్యాంకర్ల ద్వారా సరఫరా
- స్పందించకుంటే నీటి ఎద్దడి తీవ్రమయ్యే అవకాశం



ఇక్కడ కనిపిస్తున్నవి పట్టణంలోని ఆర్డీవో కార్యాలయ సమీపంలో గల మిషన్ భగీరథ పైపులైన్ లీకేజీ దృశ్యాలు. ఫలితంగా నీరంతా ఇలా రోడ్డుపై వృథాగా పోతోంది. ఈ ఒక్క చోటే కాదు.. జిల్లా కేంద్రంలోని చాలా ప్రాంతాల్లో ఇదే పరిస్థితి.

కైలాస్‌నగర్: గ్రేడ్–1 స్థాయి కలిగిన ఆదిలాబాద్ మున్సిపల్ పరిధిలో మిషన్ భగీరథ పైపులైన్, వాల్వ్‌ల లీకేజీల కారణంగా నిత్యం వేలాది లీటర్ల తాగునీరు వృథాగా పోతోంది. సకాలంలో గుర్తించకపోవడం, మరమ్మతు పనుల్లో జాప్యం అవుతుండడంతో పలు కాలనీలకు నీటి సరఫరాలో అంతరాయం ఏర్పడుతోంది. ఫలితంగా మార్చిలోనే నీటి గోస మొదలైంది. ప్రస్తుతం పట్టణంలో రోజు విడిచి రోజు నీటిని సరఫరా చేస్తున్నారు. ఎండల తీవ్రత పెరిగే కొద్ది భూగర్భజలాల మట్టం తగ్గి నీటి ఎద్దడి తీవ్రమయ్యే అవకాశం కనిపిస్తోంది. బల్దియా అధికారులు మేల్కొని ప్రత్యేక దృష్టి సారించకుంటే ఈ వేసవిలో పట్టణవాసులకు నీటి తిప్పలు తప్పకపోవచ్చనే అభిప్రాయం వ్యక్తమవుతుంది.

పలుచోట్ల ట్యాంకర్ల ద్వారా..

బల్దియా పరిధిలో కుళాయిల ద్వారా నీటిని సరఫరా చేస్తున్నప్పటికీ కేఆర్‌కే కాలనీ, భగత్‌సింగ్‌నగర్, ఖుర్షీద్‌నగర్ వంటి కాలనీల్లోని కొన్ని ప్రాంతాలకు తాగునీరు అందడం లేదు. దీంతో ఆయా చోట్లకు ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేస్తున్నారు. బల్దియాకు సంబంధించి ఆరు ట్యాంకర్లు ఉండగా మరో మూడింటిని అద్దె ప్రాతిపదికన తీసుకున్నారు. ప్రస్తుతం 170 సర్వేనంబర్ కాలనీలో నీటి సమస్య తీవ్రమైంది. అక్కడ సీసీ రోడ్లు, డ్రెయినేజీల నిర్మాణ పనులు చేపడుతుండటంతో భగీరథ పైపులైన్ పగిలిపోయింది. దీంతో ఆ కాలనీలకు ట్యాంకర్లే దిక్కయ్యాయి. ఒక్కో ట్యాంకర్ రోజుకు తొమ్మిది ట్రిప్పుల చొప్పున సరఫరా చేస్తున్నాయి. మిగతా కాలనీల్లోనూ సమస్య తలెత్తితే మరిన్ని ట్యాంకర్లను అందుబాటులోకి తెస్తామని అధికారులు చెబుతున్నారు.

జిల్లా కేంద్రంలో ఇటీవల పైపులైన్ లీకేజీలు నిత్యకృత్యంగా మారాయి. పట్టణంలోని ఏదో ఒక ప్రాంతంలో ఈ సమస్య తలెత్తుతోంది. వీటిని సకాలంలో గుర్తించకపోవడం, మరమ్మతు పనుల్లోనూ జాప్యం అవుతుండడంతో నిత్యం 5నుంచి 8ఎంఎల్‌డీల నీరు వృథాగా పోతుం


లీకేజీలతో నీరంతా వృథా..

దని మిషన్ భగీరథ అధికారులు చెబుతున్నారు. పట్టణంలో 49 వార్డులుండగా లీకేజీలు, పైపులైన్ మరమ్మతు పనులు పరిశీలించేందుకు కేవలం 8మంది మాత్రమే లైన్‌మెన్లు ఉన్నారు. వారికి సహాయకులుగా మరో ఇద్దరిని నియమించినా లీకేజీలను మాత్రం సకాలంలో పూర్తి చేయడం లేదు. ఫలితంగా నీటి వృథా తీవ్ర సమస్యగా మారింది.

ఆదిలాబాద్ పట్టణానికి రోజుకు 31.90 ఎంఎల్‌డీల నీరు అవసరం. ప్రస్తుతం 24ఎంఎల్‌డీల నీరు మాత్రమే సరఫరా అవుతుంది. ఇందులో నిర్మల్ జిల్లా దిలావర్‌పూర్ మండలం

రోజు విడిచి రోజు సరఫరా

మాటేగాం సమీపంలోని ఫిల్టర్‌బెడ్ నుంచి రోజుకు 18ఎంఎల్‌డీల నీరు మిషన్ భగీరథ ద్వారా అందుతోంది. అయితే కొన్ని కాలనీలకు కలుషిత నీరు సరఫరా అవుతున్నట్లుగా స్థానికులు పేర్కొంటున్నారు. ఆదిలాబాద్ రూరల్ మండలం లాండసాంగ్వి పంప్‌హౌస్ నుంచి 6ఎంఎల్‌డీలు సరఫరా అవుతుండగా ఇక్కడి నుంచి 17 వార్డులకు నీటిని అందిస్తున్నారు. ఎలాంటి విద్యుత్ అవసరం లేకుండా మావల చెరువు నుంచి 1.5 ఎంఎల్‌డీల నీరు ఫిల్టర్‌బెడ్‌కు అందుతుంది. ఇక్కడి నుంచి ఏడు వార్డులకు నీటిని సరఫరా చేస్తున్నారు. దీంతో పట్టణంలోని 24 వార్డులకు నిత్యం నీటిని సరఫరా చేస్తుండగా మరో 25 వార్డులకు మాత్రం రోజు విడిచి రోజు అందిస్తున్నారు.



సుందరయ్యనగర్‌లో సరఫరా అయిన కలుషిత నీరు

ప్రత్యేక దృష్టి సారిస్తున్నాం

ఇప్పటికైతే పట్టణంలో నీటి సమస్య అంతగా లేదు. కొన్ని ప్రాంతాలకు ట్యాంకర్ల ద్వారా సరఫరా చేస్తున్నాం. ఏప్రిల్ 15 నాటికి లాండసాంగ్వి పంప్‌హౌస్‌లో సమస్య తలెత్తే అవకాశముంది. దీనిని అధిగమించేందుకు ట్యాంకర్లను పెంచేలా ఇప్పటికే ప్రణాళిక సిద్ధం చేశాం. లీకేజీలను అరికట్టేందుకు దృష్టి సారిస్తున్నాం. అవసరమైతే అదనపు సిబ్బందిని నియమించుకుని తగు చర్యలు తీసుకుంటాం.

– పేరిరాజు, మున్సిపల్ ఇంజినీర్

మహిళల సంక్షేమానికి పెద్దపీట

- కలెక్టర్ రాజర్షిషా

ఆదిలాబాద్‌టౌన్: మహిళల సంక్షేమానికి ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని కలెక్టర్ రాజర్షిషా అన్నారు. మహిళా దినోత్సవం పురస్కరించుకుని జిల్లా కేంద్రంలోని జెడ్పీ సమావేశ మందిరంలో మహిళా శిశు సంక్షేమశాఖ ఆధ్వర్యంలో మంగళవారం వేడుకలు నిర్వహించారు. విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. మహిళల ఆరోగ్యంపై వైద్యులు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ఆడ పిల్లల చదువును ప్రోత్సహించాలన్నారు. పని ప్రదేశాలు, ప్రభుత్వ, ప్రైవేట్ సంస్థల్లో మహిళలను వేధింపులకు గురిచేస్తే చట్టప్రకారం చర్యలు తప్పవన్నారు. మహిళలు ఆర్థిక స్వావలంబన దిశగా ముందుకు సాగాలన్నారు. ఎమ్మెల్యే పాయల్ శంకర్ మాట్లాడుతూ అన్నిరంగాల్లో మహిళలు ముందుకెళ్తున్నారని పేర్కొన్నారు. ఎక్కడైతే స్త్రీలు గౌరవించబడతారో అక్కడ సమాజం సంతోషంగా ఉంటుందన్నారు. అనంతరం పలు స్వచ్ఛంద సంస్థలు, జిల్లా అధికారులను సన్మానించి జ్ఞాపికలు అందజేశారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ ఇన్‌చార్జి పీడీ మిల్కా, డీఈవో ప్రణీత, టీబీ నివారణ అధికారి డాక్టర్ సుమలత, మహిళా కమిషన్ సభ్యురాలు ఈశ్వరిబాయి, మహిళా సాధికారత కేంద్రం కోఆర్డినేటర్ యశోద, సఖీ కేంద్రం నిర్వాహకురాలు సరస్వతి, నాగమణి, ఐసీడీఎస్ అధికారులు, సిబ్బంది, అంగన్‌వాడీ కార్యకర్తలు, వివిధ శాఖల ఉద్యోగులు, విద్యార్థులు పాల్గొన్నారు.



డీఈవో ప్రణీతను సన్మానిస్తున్న కలెక్టర్, ఎమ్మెల్యే


ట్రాఫిక్ సమస్య పరిష్కారానికి చర్యలు

కైలాస్‌నగర్: పట్టణంలో ట్రాఫిక్ సమస్యను పరిష్కరించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని కలెక్టర్ రాజర్షి షా అన్నారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో పట్టణంలోని వీధి వ్యాపారులతో ఎస్పీ అఖిల్ మహాజన్‌తో కలిసి మంగళవారం ఆయన స మీక్ష నిర్వహించారు. ట్రాఫిక్ సమస్యను ని యంత్రించేందుకు అనుసరించాల్సిన చర్యలపై సమీక్షించారు. వీధి వ్యాపారులకు ప్రత్యామ్నాయంగా చేపట్టాల్సిన చర్యలపై ప లు సూచనలు చేశారు. ఇందులో ఆర్డీవో వి నోద్ కుమార్, డీఎస్పీ ఎల్. జీవన్‌రెడ్డి, ము న్సిపల్ కమిషనర్ సీవీఎన్. రాజు, ఇతర అధికారులు, వీధి వ్యాపారులు పాల్గొన్నారు.

హామీల అమలులో కాంగ్రెస్ సర్కారు విఫలం

- ఎమ్మెల్యే పాయల్ శంకర్

ఆదిలాబాద్: ఎన్నికల హామీలు నిలబెట్టుకోవడంలో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల్ శంకర్ అన్నారు. జిల్లా కేంద్రంలోని తన క్యాంపు కార్యాలయంలో మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి 15 నెలలు గడుస్తున్నా ఆరు గ్యారెంటీలు పూర్తిస్థాయిలో అమలు కాలేదని విమర్శించారు. 100 రోజుల్లోనే అన్నింటిని అమలు చేస్తామని శాసనసభలో ప్రకటించిన ప్రభుత్వం వాటికి నిధుల కేటాయింపులో సైతం సరైన ప్రాధాన్యత ఇవ్వలేదని మండిపడ్డారు. బుధవారం నుంచి జరిగే శాసనసభ సమావేశాల్లో హామీల అమలు విషయంలో ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకు వస్తామని తెలిపారు. అలాగే మాజీ ఎమ్మెల్యే జోగు రామన్న చేసిన వ్యాఖ్యలపై స్పందిస్తూ నాలుగు సార్లు ఎమ్మెల్యేగా ఉండి కూడా ఆదిలాబాద్ నియోజకవర్గ అభివృద్ధికి ఆయన చేసింది ఏమీ లేదని విమర్శించారు. విమానాశ్రయం విషయంలో కేంద్ర ప్రభుత్వం సానుకూలంగా స్పందించిన ఎన్‌ఓసీ ఇవ్వడానికి నాటి రాష్ట్ర ప్రభుత్వం ముందుకు రాలేదన్నారు. మరోవైపు సీసీఐ విషయంలో సైతం అనవసర రాద్ధాంతం చేస్తున్నారని, జిల్లా కేంద్రంలో రైల్వే వంతెనల విషయంలో తాను ప్రజాప్రతినిధిగా లేకపోయినా ఎంతగానో కృషి చేశానన్నారు. ఇవన్నీ మర్చిపోయి వ్యక్తిగతంగా విమర్శలకు దిగడం సబబు కాదన్నారు. తన తీరును మార్చుకోవాలని హితవు పలికారు. ఆయన వెంట నాయకులు లాలా మున్నా, ఆకుల ప్రవీణ్, జోగు రవి, ఇంద్రసేనారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే శంకర్

బీ కేర్.. 'సెల్'!

'పాత ఫోన్లకు.. ప్లాస్టిక్ డబ్బాలు ఇస్తాం' అంటూ వీధుల్లో తిరిగే వారికి పాడైపోయిన మీ సెల్‌ఫోన్లు ఇస్తున్నారా.. ఒక్క క్షణం ఆలోచించండి.. లేకుంటే మీరు కష్టాలు కొని తెచ్చుకున్నట్లే. అందులోని డేటాతో కొందరు కేటుగాళ్లు సైబర్ నేరాలకు పాల్పడుతున్నారు. జిల్లా పోలీసులు ప్రత్యేక దృష్టి సారించడంతో తాజాగా ఈ ముఠా గుట్టు రట్టయింది.



ద్విచక్ర వాహనంలోని ఫోన్లను పరిశీలిస్తున్న ఎస్పీ అఖిల్ మహాజన్

- పాత మొబైల్స్ ఇస్తున్నారా.. తస్మాత్ జాగ్రత్త
- మరమ్మతులు చేసి వాటి ద్వారానే సైబర్ మోసాలు
- లబోదిబోమంటున్న బాధితులు
- అప్రమత్తంగా ఉండాలంటున్న పోలీసులు

ఆదిలాబాద్‌టౌన్: చెడిపోయిన ఫోనే కదా.. ఇంట్లో నిరుపయోగంగా ఉండడం కంటే స్క్రాప్‌లో విక్రయిస్తే ఎంతోకొంత డబ్బులు వస్తాయి.. లేదా ఇంట్లో పనికొచ్చే గిన్నెలు, ప్లాస్టిక్ డబ్బాలతో ఏదైనా ఉపయోగం ఉంటుందని జనం అనుకుంటుంటారు. అయితే ఆ పాత ఫోన్లే కొంప ముంచుతున్నాయి. వాటిని విక్రయించిన వారికి సైబర్ నేరగాళ్లు చుక్కలు చూపుతున్నారు. ఆర్థిక లావాదేవీలతో పాటు ఇతర నేరాలకు పాల్పడినప్పుడు ఫోన్ విక్రయించిన వారు కేసుల్లో ఇరుక్కుంటున్నారు. తీరా మోసపోయామని తెలిసి బాధితులు లబోదిబోమంటున్నారు. రోజురోజుకు సైబర్ కేటుగాళ్లు కొత్త పుంతలు తొక్కుతున్నారు. పల్లెల్లో చిక్కు వెంట్రుకలకు గిన్నెలు, డబ్బాలు ఇస్తున్న విషయం తెలిసిందే. ఇదే తరహా వ్యాపారానికి బిహార్‌కు చెందిన ఓ ముఠా తెరలేపింది. గ్రామాల్లో మోటార్‌సైకిల్‌పై డబ్బాలు కట్టుకొని పాత సెల్‌ఫోన్లు కొంటాం.. అంటూ తిరుగుతున్నారు. విషయం తెలియని అమాయకులు వారికి ఎంతో కొంతకు విక్రయిస్తున్నారు. లేదా వస్తువులు తీసుకొని ఇచ్చేస్తున్నారు. అయితే ఇలాంటి వారిపైన అప్రమత్తంగా ఉండాలని పోలీసులు సూచిస్తున్నారు. జిల్లాలో బిహార్ ముఠా ఏకంగా 2వేలకు పైగా పాత సెల్‌ఫోన్లను కొనుగోలు చేసి ఆ రాష్ట్రానికి తరలించేందుకు సిద్ధంగా ఉండగా, జిల్లా పోలీసులు పసిగట్టి వారి గుట్టురట్టు చేశారు.

సైబర్ కేటుగాళ్ల ప్లాన్ ఇలా..

- బిహార్‌కు చెందిన ముఠా ద్విచక్ర వాహనాలపై పల్లె, పట్టణాల్లో తిరుగుతూ చెడిపోయిన సెల్‌ఫోన్లతో పాటు పనిచేసే వాటిని తీసుకుని ప్లాస్టిక్ డబ్బాలు, గిన్నెలు అందజేస్తారు. ఇలా సేకరించిన వాటిని ఢిల్లీకి చెందిన డీలర్లకు ఒక్కోటి రూ.100 చొప్పున విక్రయిస్తారు. వారు వాటిని కాంబోడియా, ఫిలిప్పైన్స్, లాంగోస్, సౌత్‌ఈస్ట్ ఏసియా దేశాలకు తరలించి సైబర్ నేరాలకు పాల్పడే వారికి విక్రయిస్తారు. అక్కడ వాటికి రిపేర్లు చేసి అందులో ఐఎంఈఐ నంబర్‌తో సెల్‌ఫోన్ వినియోగదారు సమాచారం సేకరిస్తారు. మరోవైపు మన దేశంలోని వివిధ ప్రాంతాలకు చెందిన నిరుద్యోగులకు ఉద్యోగాలిప్పిస్తామని ఆయా దేశాలకు చెందిన సైబర్‌మోసగాళ్లు వల విసురుతారు. ఇక్కడి నుంచి సింగాపూర్‌కు తీసుకెళ్లి వారి వీసాను లాక్కుంటారు. తిరిగి వెళ్లకుండా ఇబ్బందులకు గురిచేస్తారు. గత్యంతరం లేని పరిస్థితుల్లో కొంతమంది సైబర్ మోసగాళ్లు చెప్పే పనులకు బలవుతుంటారు. ఆయా భాషల్లో నైపుణ్యం సాధించేలా వారికి ప్రత్యేక శిక్షణ ఇస్తారు. బ్యాంకు ఉద్యోగులు, పోలీసు అధికారులుగా, పార్ట్ టైమ్ జాబ్ కల్పిస్తామని వారితో ఫోన్లు చేయిస్తారు. లింకులు, ఓటీపీల ద్వారా బ్యాంకులో ఉన్న డబ్బును కాజేస్తారు. అమాయకులతో పాటు అన్ని తెలిసిన వారు సైతం వీరి వలలో పడుతున్నారు. రూ.లక్షల్లో మోసపోతున్నారు.


ఇటీవల పెరుగుతున్న కేసులు..

జిల్లాలో రోజురోజుకు సైబర్ కేసులు పెరుగుతూనే ఉన్నాయి. అమాయకులు వారి ఉచ్చులోపడి నష్టపోతున్నారు. గతేడాది దాదాపు 200 వరకు కేసులు నమోదయ్యాయి. ఇందులో ఆర్థిక లావాదేవీలకు సంబంధించి 86 కేసులున్నాయి. బాధితుల నుంచి సైబర్ మోసగాళ్లు రూ.1 కోటి 50లక్షల వరకు దోచుకున్నారు. అయితే కొన్ని డబ్బులను బ్యాంకుల్లో సైబర్ పోలీసులు ఫ్రీజింగ్ చేశారు. గతేడాది మూడు లోక్ అదాలత్‌లలో రూ.17లక్షల 60వేలను బాధితులకు అందజేశారు. ఈ ఏడాది 15 కేసుల వరకు నమోదయ్యాయి. రూ.5లక్షల వరకు సైబర్ మోసగాళ్ల చేతిలో నష్టపోయారు.

ఖాతా మాయమే..

బ్యాంకు ఖాతా మనదే అయినప్పటికీ మనం విక్రయించే ఫోన్లు, ఇతర వివరాలు తెలుపడంతో అందులో ఉన్న డబ్బులను మనకు తెలియకుండగానే కాజేస్తున్నారు. ఫోన్లను హ్యాక్ చేసి ఓటీపీలు పంపి మోసాలకు పాల్పడుతున్నారు. జిల్లాలో సైబర్ నేరాలకు సంబంధించి అవగాహన కల్పిస్తున్నప్పటికీ ఇంకా బాధితులు నేరగాళ్ల చేతిలో మోసపోతూనే ఉన్నారు. మన మెయిల్, ఫేస్‌బుక్‌లను హ్యాక్ చేసి సందేశాలను పంపుతూ కొల్లగొడుతున్నారు. ఇటీవలే క్రెడిట్ కార్డు లిమిట్ పెంచాలా అని, మీ పిల్లలు మత్తు పదార్థాల కేసుల్లో ఇరుక్కుపోయారని, పోలీసులమని బెదిరింపులకు పాల్పడుతూ మోసగాళ్లు బాధితుల ఖాతాల్లో నుంచి డబ్బులు మాయం చేస్తున్నారు.

అప్రమత్తంగా ఉండాలి



సైబర్ మోసాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలి. కొందరు గ్రామాలకు వచ్చి పాత సెల్‌ఫోన్లను కొనుగోలు చేస్తున్నారు. పని చేయని మొబైల్స్‌ను ఎవరికీ విక్రయించొద్దు. ఎవరికైన ఫోన్లు విక్రయించినా, కొనుగోలు చేసినా తప్పనిసరిగా బిల్లులు తీసుకోవాలి. కొంత మంది అమాయకులతో పాటు అన్ని తెలిసిన వారు కూడా నేరగాళ్ల చేతిలో మోసపోతున్నారు. ఒకవేళ డబ్బులు పోగొట్టుకుంటే వెంటనే టోల్‌ఫ్రీ నం.1930కు సమాచారం అందించాలి. www. cybercrime. comలో ఫిర్యాదు చేయాలి.

– అఖిల్ మహాజన్, ఎస్పీ

క్లుప్తంగా

ముగిసిన సిరిచెల్మ మల్లన్న జాతర


అగ్నిగుండంలో నుంచి నడుస్తున్న భక్తులు

ఇచ్చోడ: ఈ నెల 4న ప్రారంభమైన సిరిచెల్మ మల్లికార్జునస్వామి జాతర మంగళవారం ముగిసింది. ఉదయం తెల్లవారుజామున ఆలయ ఆవరణలో ఏర్పాటు చేసిన అగ్నిగుండంలో నుంచి భక్తులు నడుస్తూ మొక్కులు తీర్చుకున్నారు. అంతకు ముందు గ్రామప్రధాన వీధుల గుండా రథోత్సవం నిర్వహించారు. వారం రోజులపాటు కొనసాగిన జాతర రెండు ప్రధాన ఘట్టాలతో ముగిసింది.

రాష్ట్రస్థాయి పోటీల్లో విద్యార్థుల ప్రతిభ



బహుమతులు ప్రదానం చేస్తున్న పీవో

ఉట్నూర్‌రూరల్: ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని 4, 5వ తరగతి విద్యార్థులకు నిర్వహించిన వర్డ్ పవర్ ఛాంపియన్ షిప్ (డబ్ల్యూపీసీ) రాష్ట్రస్థాయి పోటీల్లో విద్యార్థులు ప్రతిభ కనబర్చారు. ఈ పోటీల్లో స్పెల్లింగ్, రీడింగ్, అర్థం రౌండ్ల అనంతరం అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులను ఎంపిక చేశారు. 4వ తరగతి నుండి ఆడే విజయ్‌కుమార్ (నిర్మల్), యశ్వంత్ (ఆసిఫాబాద్), రాజేశ్ (ఆసిఫాబాద్), కోట్నాక్ కళ్యాణ్ (ఆసిఫాబాద్), కుర్సెంగ వినోద్ (ఆసిఫాబాద్) విద్యార్థులు ప్రతిభ కనబర్చారు. 5వ తరగతి నుండి కృష్ణ ధృవ (ఆసిఫాబాద్), తొడసం వైష్ణవి(ఆదిలాబాద్), మడావి వరలక్ష్మి (ఆదిలాబాద్), రాథోడ్ బాలాజీ(నిర్మల్), లక్ష్మణ్‌చౌదరి (నిర్మల్), కిరణ్ రాథోడ్ (ఆసిఫాబాద్) జిల్లాలకు చెందిన విద్యార్థులు సత్తాచాటారు. విజేతలకు ఐటీడీఏ పీవో ఖుష్బూ గుప్తా బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో ఏసీఎంవో జగన్, విభా ఫౌండేషన్ సీనియర్ ప్రొగ్రాం మేనేజర్ వీరనారాయణ పాల్గొన్నారు.

వార్డెన్, హెచ్‌ఎంను సస్పెండ్ చేయాలి


మాట్లాడుతున్న సిడాం జంగుదేవ్

ఉట్నూర్‌రూరల్: ఇచ్చోడ గిరిజన ఆశ్రమ పాఠశాలలో విద్యార్థిని మృతికి కారకులైన వార్డెన్, హెచ్‌ఎంను సస్పెండ్ చేయాలని ఆదివాసీ విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సిడాం జంగుదేవ్ పటేల్ డిమాండ్ చేశారు. మంగళవారం ఉట్నూర్ కేబీ కాంప్లెక్స్ ఆవరణలో నిరసన తెలిపారు. ఆయన మాట్లాడుతూ లేనిపక్షంలో విద్యార్థి సంఘాలు ఆదివాసీ బహుజన సంఘాల ఆధ్వర్యంలో ఐటీడీఏ కార్యాలయం ముట్టడిస్తామని హెచ్చరించారు. త్రిమూర్తి, పెందూర్ తుకారాం, పెందూర్ మోతీరాం, కుమ్ర కిసాన్, దేవిషావ్ పాల్గొన్నారు.

గ్రూప్-2లో మెరిసిన మనోళ్లు

టీజీపీఎస్సీ మంగళవారం విడుదల చేసిన గ్రూప్-2 పరీక్ష ఫలితాల్లో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా అభ్యర్థులు సత్తా చాటారు. ఇప్పటికే ప్రభుత్వ ఉద్యోగం చేస్తున్న వారుసైతం పోటీ పరీక్షలకు సన్నద్ధమై ఉత్తమ ర్యాంకులు సాధించారు. వీరంతా సర్టిఫికెట్ వెరిఫికేషన్ తర్వాత ఉద్యోగ నియామక పత్రాలు అందుకోనున్నారు.

- ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా వాసులకు ర్యాంకులు


అశోక్ కుమార్‌ను అభినందిస్తున్న కుటుంబ సభ్యులు

250 ర్యాంక్ సాధించిన అశోక్‌కుమార్

తాంసి: మండల కేంద్రానికి చెందిన జానకొండ అశోక్ కుమార్ గ్రూప్-2లో ఫలితాల్లో 380 మార్కులతో రాష్ట్రస్థాయిలో 250వ ర్యాంక్ సాధించాడు. ప్రస్తుతం జైనథ్ మండలం సుందరగిరి గ్రామ పంచాయతీ కార్యదర్శిగా విధులు నిర్వహిస్తున్నాడు. సోమవారం విడుదలైన గ్రూప్-1 ఫలితాల్లో 399 మార్కులు సాధించాడు. సోదరుడు శ్రీకాంత్ అందించిన సహకారంతో గ్రూప్-1, 2 పరీక్షలకు సన్నద్ధమై విజయం సాధించినట్లు అశోక్ కుమార్ పేర్కొంటున్నాడు.

97వ ర్యాంక్ లెక్కల శ్రావణ్


శ్రావణ్‌కుమార్

మంచిర్యాలరూరల్ (హాజీపూర్): మంచిర్యాల జిల్లా హాజీపూర్ మండలం గుడిపేటకు చెందిన లెక్కల లింగయ్య, కళావతి దంపతుల కుమారుడు శ్రావణ్‌కుమార్ గ్రూప్-2 ఫలితాల్లో రాష్ట్రస్థాయిలో 97వ ర్యాంక్ సాధించాడు. 2019లోనే జిల్లాస్థాయిలో మొదటి ర్యాంక్, రాష్ట్రస్థాయిలో 10వ ర్యాంక్‌తో పంచాయతీ కార్యదర్శిగా ఉద్యోగం సాధించిన శ్రావణ్ సంతృప్తి లేకపోవడంతో ఉద్యోగానికి రాజీనామా చేశాడు. గతేడాది గ్రూప్-4లో జిల్లాస్థాయిలో 11వ ర్యాంక్ సాధించి బెల్లంపల్లి తహసీల్దార్ కార్యాలయంలో జూనియర్ అసిస్టెంట్‌గా పని చేస్తున్నాడు. ప్రస్తుతం విడుదల చేసిన గ్రూప్-2 ఫలితాల్లో 394 మార్కులతో రాష్ట్రస్థాయిలో 97వ ర్యాంక్ సాధించాడు. గ్రూప్-1లోనూ 404 మార్కులు సాధించాడు.

191 ర్యాంకు సాయిరాం



కౌటాల: కుమురంభీం జిల్లా కౌటాల మండలంలోని తలోడి గ్రామానికి చెందిన మండల రాజేశం గౌడ్-తారక్క దంపతుల కుమారుడు సాయిరాం గౌడ్ గ్రూప్-2లో 383 మార్కులతో రాష్ట్రస్థాయిలో 191 ర్యాంకు సాధించాడు. సాయిరాం ప్రస్తుతం బెజ్జూర్ మండలం మొగవెల్లి పంచాయతీ కార్యదర్శిగా విధులు నిర్వహిస్తున్నాడు. గ్రూప్-4లో రెవెన్యూ జూనియర్ అసిస్టెంట్‌గా సెలెక్ట్ కావడంతో పాటు గ్రూప్-1 మెయిన్స్‌లో 436 మార్కులు సాధించాడు.

మెరిసిన 'బజార్‌హత్నూర్' యువకులు


ఉదయ్‌కుమార్


బుద్దేవార్ ముఖేష్

బజార్‌హత్నూర్: ఆదిలాబాద్ జిల్లా బజార్ హత్నూర్ మండల కేంద్రానికి చెందిన బిట్లింగు లక్ష్మణ్, సరస్వతి దంపతుల కుమారుడు ఉదయ్‌కుమార్ 404 మార్కులతో రాష్ట్రస్థాయిలో 51వర్యాంకు సాధించాడు. ఉదయ్ ప్రస్తుతం ఆదిలాబాద్ ట్రెజరీలో జూనియర్ అకౌంటెంట్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. మండలంలోని కొలారి గ్రామానికి చెందిన బుద్దేవార్ రాధ, నర్సింహులు దంపతుల కుమారుడు బుద్దేవార్ ముఖేష్ గ్రూప్-2 ఫలితాల్లో 418 మార్కులతో రాష్ట్రస్థాయిలో 15వ ర్యాంకు సాధించాడు. 2019లో పంచాయతీ కార్యదర్శి, 2021లో నీటిపారుదల శాఖలో జూనియర్ అసిస్టెంట్ ఉద్యోగం సాధించాడు.

337వ ర్యాంకు సాధించిన వెంకటేశ్



నస్పూర్: మంచిర్యాల జిల్లా నస్పూర్‌కు చెందిన పోలంపల్లి వెంకటేశ్ గ్రూప్-2 ఫలితాల్లో 375 మార్కులతో రాష్ట్రస్థాయిలో 337వ ర్యాంకు సాధించాడు. 2014లో నిర్వహించిన వీఆర్‌వో పరీక్షలలో ఉమ్మడి జిల్లా టాపర్‌గా నిలిచాడు. కొంత కాలం నస్పూర్ తహసీల్దార్ కార్యాలయంలో వీఆర్‌ఏగా విధులు నిర్వహించాడు. ప్రస్తుతం లక్సెట్టిపేట మోడల్ డిగ్రీ కళాశాలలో జూనియర్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తున్నాడు.

సత్తా చాటిన యువకులు


సురేష్‌రెడ్డి


సుమంత్

నెన్నెల: మంచిర్యాల జిల్లా నెన్నెల మండలంలోని ఆవుడం గ్రామానికి చెందిన యువకులు గ్రూప్-2 ఫలితాల్లో సత్తా చాటారు. చీర్ల లక్ష్మయ్య-రమక్క దంపతుల కుమారుడు సురేష్‌రెడ్డి రాష్ట్రస్థాయిలో 55వ ర్యాంకు సాధించగా మండల మురళిగౌడ్, ఉష దంపతుల కుమారుడు సుమంత్ 172వ ర్యాంకు సాధించాడు. సురేష్‌రెడ్డి ప్రస్తుతం సింగరేణిలో జూనియర్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తూనే గ్రూపు-2లో ర్యాంకు సాధించాడు. సుమంత్ ప్రస్తుతం జీహెచ్‌ఎంసీలో జూనియర్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తున్నాడు.

19వ ర్యాంక్ శివకృష్ణ



ఆసిఫాబాద్‌అర్బన్/ఆసిఫాబాద్‌రూరల్: కుమురం భీం జిల్లా కేంద్రానికి చెందిన శ్రీరామ్ సత్యనారాయణ, వాణిశ్రీ దంపతుల కుమారుడు శివకృష్ణ గ్రూప్-2 ఫలితాల్లో రాష్ట్రస్థాయిలో 19వ ర్యాంకు, జోన్‌స్థాయిలో 4వ ర్యాంకు సాధించాడు. సత్యనారాయణ స్థానిక సరస్వతి శిశుమందిర్‌లో ఉపాధ్యాయుడిగా విధులు నిర్వహిస్తుండగా శివకృష్ణ అదే పాఠశాలలో చదివి ట్రిపుల్ ఐటీలో సీటు సాధించాడు. గతేడాది ప్రకటించిన గ్రూప్-4 ఫలితాల్లో రాష్ట్రంలోనే మొదటి ర్యాంకు సాధించగా ప్రస్తుతం జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌లో ఆడిట్ సెక్షన్‌లో విధులు నిర్వర్తిస్తున్నారు.

188వ ర్యాంకు సాయికృష్ణ



సారంగపూర్: నిర్మల్ జిల్లా సారంగపూర్ మండలంలోని బీరవెల్లి గ్రామానికి చెందిన బట్టు నర్సన్న-సురేఖ దంపతుల కుమారుడు సాయికృష్ణ గ్రూప్-2 ఫలితాల్లో 188వ ర్యాంకు సాధించి తన సత్తా చాటుకున్నాడు. నర్సన్న స్థానికంగా బిజినెస్ చేస్తుండగా సురేఖ దేగాం ఉన్నత పాఠశాలలో పీడీగా విధులు నిర్వర్తిస్తున్నారు. చిన్నతనం నుంచి చదువుపై ఆసక్తి ఉన్న సాయికృష్ణ ఇంటర్ హైదరబాద్‌లోని శ్రీచైతన్య జూనియర్ కళాశాలలో, ఢిల్లీలో బీటెక్ పూర్తి చేసి తొలి ప్రయత్నంలోనే గ్రూప్-2లో విజయం సాధించాడు. తల్లిదండ్రులు, గురువుల సహకారంతోనే విజయం సాధించానని పేర్కొన్నాడు.

గ్రూప్-1 ఫలితాల్లో సత్తా



నిర్మల్‌ఖిల్లా: నిర్మల్ జిల్లా కేంద్రానికి చెందిన ఎర్రవోతు శ్యామల, ముత్తన్న దంపతుల కుమారుడు సాయి ప్రణయ్ టీజీపీఎస్సీ ఇటీవల విడుదల చేసిన ఫలితాల్లో 557 మార్కులు సాధించి రాష్ట్రస్థాయిలో ప్రతిభ కనబరిచాడు. సాయి ప్రణయ్ ఒకటి నుంచి ఏడో తరగతి వరకు స్థానిక సెయింట్ థామస్ పాఠశాలలో, 8 నుంచి 10 వరకు హైదరాబాద్‌లోని గురుకులంలో, ఇంటర్ నారాయణ జూనియర్ కాలేజీలో, బీటెక్ సీఎంఆర్ ఇంజినీరింగ్ కళాశాలలో పూర్తి చేశాడు. గతేడాది నిర్వహించిన గ్రూప్-1 ప్రిలిమ్స్, మెయిన్స్ పరీక్షలకు హాజరయ్యాడు. తాజాగా వెల్లడైన ఫలితాల్లో అత్యున్నత మార్కులు సాధించాడు.

గోలేటివాసికి 229వ ర్యాంకు

రెబ్బెన: కుమురంభీం జిల్లా కౌటాల మండలంలోని గుడ్లబోరికి చెందిన కామ్రే రావూజీ, లహనుబాయి దంపతుల కుమారుడు భాస్కర్ రాష్ట్రస్థాయిలో 229వ ర్యాంకు సాధించాడు. ప్రస్తుతం బెల్లంపల్లి ఏరియాలోని ఏరియా స్టోర్స్‌లో సీనియర్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. ఒకవైపు ఉద్యోగ బాధ్యతలు నిర్వహిసూ్తనే మరోవైపు గ్రూప్-2 కోసం సంసిద్ధమయ్యాడు. ఆన్‌లైన్‌లో కోచింగ్, సొంత ప్రిపరేషన్‌తో గ్రూప్-2 ఫలితాల్లో 381.065 మార్కులు సాధించి రాష్ట్ర స్థాయిలో 229 ర్యాంకు సాధించాడు. కష్టపడి చదివితే విజయం దానంతట అదే వస్తుందని భాస్కర్ అంటున్నాడు.


భాస్కర్ →

అమ్మా.. నీ తప్పుకు నన్ను చంపేశావా?

'అమ్మా.. ఇంకో మూడు నెలలైతే లోకం చూసేవాడిని కదమ్మా.. ఎందుకమ్మ ఇంత పనిచేశావు. నీ కడుపులో నన్ను మోయలేక పోయావా.. ఆరు నెలలుగా నీ కడుపులో హాయిగా పెరుగుతున్నా.. నీవు మింగిన మాత్రలకు నాకు ఊపిరి ఆడడం లేదమ్మా.. లోకం చూపించి అనాథాశ్రమంలో పడేసినా బాగుండేది.. తెల్లవారేసరికే నా ఊపిరి తీశావేంటమ్మా.. నీవు చేసిన తప్పుకు నన్ను బలి ఇచ్చావా..'


పసికందు మృతదేహం

- గురుజలో ఆరు నెలల పిండం
- కడుపులోనే చంపి.. వాగులో పడేసి..
- విచారణ జరుపుతున్న పోలీసులు...

గుడిహత్నూర్: ఆదిలాబాద్ జిల్లా గుడిహత్నూర్ మండలంలోని గురుజ వాగులో పడేసిన పిండానికి మాటలు వస్తే ఇలాగే ప్రశ్నించేదేమో. క్షణికావేశంలో చేసిన తప్పుకు గర్భం దాల్చిన ఓ యువతి.. బయటి ప్రపంచానికి ఆ విషయం తెలియకుండా ఉండేందుకు ఆరు నెలల గర్భంలోనే పిండాన్ని చంపేశారు. ఈ హృదయ విదారక సంఘటన గురుజ గ్రామంలో చోటు చేసుకుంది. పోలీసులు, గ్రామస్తులు తెలిపిన ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి... మంగళవారం ఉదయం గ్రామ శివారులోని వాగు ప్రాంతానికి బహిర్భూమికి వెళ్లిన కొందరు గ్రామస్తులకు మృత శిశువు కనిపించింది. పోలీసులకు సమాచారం అందించడంతో ఎస్సై మహేందర్ సంఘటనా స్థలానికి చేరుకొని శిశువు మృతదేహాన్ని రిమ్స్‌కు తరలించారు. ఈ ఘటనపై విచారణ చేపట్టారు. స్థానికులు అందించిన వివరాలను సేకరించి ఉన్నతాధికారులకు సమాచారం అందించారు. కేసు నమోదు చేసుకొని వెంటనే దర్యాప్తు చేపట్టారు. ఈ క్రమంలో ఓ యువతి, ఇద్దరు యువకులతోపాటు ఆర్‌ఎంపీని అదుపులోని తీసుకున్నట్లు తెలిసింది. పెళ్లి కాకుండానే గర్భం దాల్చిన ఓ యువతి.. ఆరు నెలల గర్భాన్ని తీయించుకునేందుకు ఆర్‌ఎంపీని ఆశ్రయించినట్లు సమాచారం. మంగళవారం రాత్రి గ్రామంలో తిరిగిన సదరు ఆర్‌ఎంపీ ప్రాణాపాయమని తెలిసినా.. ఆరు నెలల గర్భాన్ని తొలగించారు. ఆ పిండాన్ని ఇలా వాగులో పడేసి ఉంటారని ప్రచారం జరుగుతోంది. దర్యాప్తు పూర్తి కానందున పూర్తి వివరాలు బుధవారం అందిస్తామని సీఐ భీమేష్ తెలిపారు. మృత శిశువును పరీక్షించిన వైద్యులు మగ శిశువుగా నిర్ధారించారు. పిండం వయస్సు సుమారు 6 నెలలు దాటి ఉండవచ్చని సమాచారం.

ఏసీబీకి చిక్కిన అవినీతి అధికారి

- రూ.50వేలు లంచం తీసుకుంటూ పట్టుబడ్డ డిప్యూటీ ఈఈ
- బిల్లుల మంజూరు కోసం రూ.లక్ష డిమాండ్


ఏసీబీకి పట్టుబడిన శంకర్

ఆదిలాబాద్‌రూరల్: ఓ అవినీతి అధికారి ఏసీబీ వలలో చిక్కాడు. ఆదిలాబాద్‌లోని ఎడ్యుకేషనల్ వెల్ఫేర్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్‌లో డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ జిన్నాంవార్ శంకర్ కాంట్రాక్టర్ నుంచి రూ.50వేలు లంచం తీసుకుంటూ మంగళవారం ఏసీబీకి పట్టుబడ్డాడు. వివరాలిలా ఉన్నాయి. టీజీఇడబ్ల్యూఐడీసీ డిప్యూటీ ఈఈ శంకర్ ఇటీవల కాంట్రాక్టర్‌ను ఇబ్బందులకు గురి చేస్తున్నాడు. కేఆర్కే కాలనీ సమీపంలో మైనార్టీ రెసిడెన్షియల్ పాఠశాల పనుల కాంట్రాక్ట్‌ను కరుణాకర్ రావు దక్కించుకున్నాడు. రూ.14.36 కోట్లతో జిల్లా కేంద్రానికి చెందిన సబ్ కాంట్రాక్టర్ నారాయణరెడ్డి తీసుకుని పనులు చేపడుతున్నాడు. విడతల వారీగా పూర్తయిన పనులకు సంబంధించి రూ.2 కోట్లు విడుదలయ్యాయి. మంజూరైన ఈ బిల్లులను డీఈఈ శంకర్ మరో భవన నిర్మాణం చేపడుతున్న కాంట్రాక్టర్‌కు చెల్లించేందుకు సిద్ధమయ్యాడు. విషయం తెలుసుకున్న నారాయణరెడ్డి మంగళవారం డిప్యూటీ ఈఈని కార్యాలయంలో కలిశాడు. తాను చేసిన పనులకు గాను మంజూరైన డబ్బులు విడుదల చేయాలని కోరాడు. 0.5 శాతం ఇవ్వాలని సదరు అధికారి సూచించాడు. ఈ క్రమంలో కాంట్రాక్టర్ ఏసీబీని ఆశ్రయించాడు. ఆ సమయంలోనే అధికారి ఫోన్ చేసి డబ్బులు అడిగాడు. తాను నిర్మాణం చేపడుతున్న భవనం దగ్గరికి రావాలని పేర్కొన్నాడు. మంగళవారం రూ.50వేలు, మిగతా రూ. 50వేలు బుధవారం ఇవ్వాలని కాంట్రాక్టర్‌తో సదరు అధికారి ఒప్పందం కుదుర్చుకున్నాడు. బిల్లులు విడుదలైన ప్రతీసారి కమీషన్ ఇవ్వాలని పేర్కొన్నాడు. మధ్యాహ్నం సదరు అధికారి నిర్మాణం చేపడుతున్న భవనం దగ్గరికి రాగా కాంట్రాక్టర్ ఆయనకు రూ.50వేలు ఇస్తుండగా ఏసీబీ అధికారులు రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. అధికారి నుంచి డబ్బులు స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేశారు. పట్టుబడ్డ అధికారిని కరీంనగర్‌కు తరలించారు. బుధవారం ఏసీబీ కోర్టులో హాజరు పర్చనున్నట్లు పేర్కొన్నారు. దాడుల్లో ఏసీబీ డీఎస్పీ విజయ్‌కుమార్, సీఐలు కిరణ్‌రెడ్డి, స్వామి ఉన్నారు.

వైద్యురాలు శృతికి సన్మానం


సన్మానిస్తున్న వాసవీ వనిత క్లబ్ సభ్యులు

మంచిర్యాలటౌన్: అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పు రస్కరించుకొని మంగళవారం పట్టణంలోని వైశ్యభవన్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వివిధ రంగాలలో విశిష్ట సేవలందించిన మహిళలను మంచిర్యాల వాసవీ వనిత క్లబ్ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. వైద్య రంగంలో ఉత్తమ సేవలు అందించిన బర్త్‌రూట్ ఆస్పత్రి వైద్యురాలు శృతి గోలిని ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో వాసవీ వనిత క్లబ్ అధ్యక్షురాలు మల్యాల సంగీత, సెక్రటరి కే.గాయత్రి, కోశాధికారి గుండా సునీత, పలువురు మహిళలు పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో రైతు మృతి

భైంసారూరల్: మండలంలోని కోతల్‌గాం గ్రామానికి చెందిన రైతు పోలబోయిన భోజన్న(62) విద్యుత్ షాక్‌తో మంగళవారం మృతి చెందినట్లు సీఐ నైలు తెలిపారు. గ్రామానికి చెందిన భోజన్న అడవి జంతువుల బారి నుంచి పంటను రక్షించుకునేందుకు విద్యుత్ తీగలు అమర్చాడు. ఎప్పటిలాగే మంగళవారం రైతు తన పంటపొలంలోకి వెళ్లగా విద్యుత్ తీగలు తగిలి అక్కడికక్కడే మృతి చెందాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు సీఐ తెలిపారు.

ఐదుగురు జూదరుల అరెస్టు

ఆదిలాబాద్‌టౌన్(జైనథ్): భోరజ్ మండలంలోని గిమ్మ గ్రామ శివారులో పేకాట ఆడుతున్న ఐదుగురిని అరెస్టు చేసినట్లు జైనథ్ ఎస్సై పురుషోత్తం తెలిపారు. గంధ్రత్ సతీష్, అయిండ్ల కిరణ్ కుమార్, కందుల సాయికృష్ణ, జి సతీష్, ఎస్ రాకేష్‌లను అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి 52 పేక ముక్కలు, రూ. 43,290 నగదును సీజ్ చేసినట్లు ఆయన పేర్కొన్నారు. శ్రీకాంత్ అనే మరో వ్యక్తి పరారయ్యాడన్నారు.

'సైబర్' కుట్ర భగ్నం


వివరాలు వెల్లడిస్తున్న ఆదిలాబాద్ ఎస్పీ అఖిల్ మహాజన్

- ఆరుగురు అంతర్రాష్ట్ర ముఠా సభ్యులపై కేసు
- పోలీసుల అదుపులో ఐదుగురు నిందితులు
- 2,125 పాత మొబైళ్లు, 107 సిమ్ కార్డులు, 600 మొబైల్ బ్యాటరీలు, 5 వాహనాలు సీజ్
- వివరాలు వెల్లడించిన ఆదిలాబాద్ ఎస్పీ అఖిల్ మహాజన్

ఆదిలాబాద్‌టౌన్: సైబర్ నేరాలకు పాల్పడాలనే భారీ కుట్రను ఆదిలాబాద్ జిల్లా పోలీసులు భగ్నం చేశారు. అంతర్రాష్ట్ర సైబర్ నేరస్తులను టూటౌన్, సైబర్‌క్రైం పోలీసులు అరెస్టు చేశారు. వారి నుంచి మొబైల్ ఫోన్లు, సిమ్ కార్డులు, ద్విచక్ర వాహనాలు, మొబైల్ బ్యాటరీలను స్వాధీనం చేసుకుని ఆరుగురిపై కేసు నమోదు చేశారు. ఒకరు పరారీలో ఉండగా, ఐదుగురిని అరెస్టు చేశారు. ఎస్పీ అఖిల్ మహాజన్ మంగళవారం జిల్లా కేంద్రంలోని పోలీస్ హెడ్‌క్వార్టర్‌లోని సమావేశ మందిరంలో ఇందుకు సంబంధించిన వివరాలు వెల్లడించారు. బిహార్ రాష్ట్రంలోని కాతిహర్ జిల్లా హతియదిర గ్రామానికి చెందిన ఆరుగురు ముఠాగా ఏర్పడి దేశ వ్యాప్తంగా సైబర్ నేరాలకు పాల్పడడానికి కుట్ర పన్నినట్లు తెలిపారు. ఇందులో ఏ-1గా ఉన్న తబారక్ మిగతా ఐదు గురిని బైక్‌లపై తెలంగాణ రాష్ట్రానికి పంపించాడు. వారు పాత మొబైళ్ల తీసుకొని ప్లాస్టిక్ డబ్బాలు ఇస్తామంటూ పట్టణాలు, పల్లెల్లో తిరిగారు. పాత మొబైళ్ల సిమ్‌కార్డు, బ్యాటరీలను సేకరించారు. వాటిద్వారా వివిధ రాష్ట్రాల్లోని ప్రజలకు బ్యాంక్ అధికారులంటూ ఫోన్ చేసి సైబర్ బారిన పడే విధంగా కుట్ర పన్నారు. వారి కుట్రను ఆదిలాబాద్ పోలీసులు భగ్నం చేసినట్లు ఎస్పీ పేర్కొన్నారు. నిందితులు మహ్మద్ మెరాజుల్, మెహెబూబ్ ఆలం, మహ్మద్ జమాల్, ఎండీ ఉజీర్, అబ్దుల్లాను అరెస్టు చేయగా ఏ-1 నిందితుడు తబారక్ పరారీలో ఉన్నట్లు తెలిపారు. అరెస్టయిన వారి వద్ద నుంచి 2,125 పాత మొబైల్ ఫోన్లు, 107 సిమ్ కార్డులు, ఐదు ద్విచక్ర వాహనాలతో పాటు వారు వినియోగించే మొబైల్ ఫోన్‌లు, 600 మొబైల్ బ్యాటరీలను స్వాధీనం చేసుకుని టూటౌన్ పోలీసు స్టేషన్‌లో కేసు నమోదు చేసినట్లు తెలిపారు. కుట్ర భగ్నం చేసిన సైబర్ డీఎస్పీ హసీబుల్లా, ఆదిలాబాద్ డీఎస్పీ ఎల్. జీవన్‌రెడ్డి, టూటౌన్ సీఐ కరుణాకర్‌రావు, సీసీఎస్ ఇన్‌స్పెక్టర్ చంద్రశేఖర్‌ను ఎస్పీ అభినందించారు.

భారీగా టేకు చెట్ల నరికివేత

ఇచ్చోడ: సిరిచెల్మ అటవీ ప్రాంతంలోని ఫకీర్‌పేట్ బీట్‌లో టేకు చెట్లు స్మగ్లర్ల చేతిలో నరికివేతకు గురవుతున్నాయి. టేకుచెట్లను నరికి సైజులుగా మార్చి బైక్‌లపై తరలిస్తున్నట్లు తెలుస్తోంది. మాన్కపూర్ వద్ద చెక్‌పోస్టు ఉన్నప్పటికీ కలప తరలించుకుపోవడం పలు అనుమానాలకు తావిస్తోంది. సిరిచెల్మలో టైగర్‌జోన్ అటవీ అధికారి క్యాంపు కార్యాలయం, ఫకీర్‌పేట్ వద్ద బేస్ క్యాంపులు ఉన్నాయి. వీటికి సమీపంలోనే టేకుచెట్లు నరికివేతకు గురికావడం అటవీశాఖ పనితీరుకు అద్దం పడుతోంది. దీనిపై టైగర్‌జోన్ ఎఫ్‌ఆర్వో నాగవత్ స్వామిని 'సాక్షి' వివరణ కోరగా టేకు చెట్లు నరికినట్లు తమ దృష్టికి వచ్చిందని, చెట్లు నరికిన వారి కోసం గాలిస్తున్నట్లు తెలిపారు.


స్మగ్లర్లు నరికిన టేకు చెట్టు

భైంసాలో బైక్ చోరీ

భైంసాటౌన్: పట్టణంలో చోరీల పరంపర కొనసాగుతూనే ఉంది. వరుస చోరీలు పట్టణ వాసులను కలవరపెడుతున్నాయి. తాజాగా పట్టణంలోని గాంధీగంజ్ ప్రాంతంలో బైక్ చోరీకి గురైంది. సీఐ జీ. గోపినాథ్ కథనం ప్రకారం.. మండలంలోని హంపోలికి చెందిన ఊరే సుభాష్ పట్టణంలో ప్రైవేట్ ఉద్యోగిగా పనిచేస్తున్నాడు. ఈ క్రమంలో సోమవారం దుకాణం ఎదుట బైక్ నిలిపి ఉంచాడు. సాయంత్రం కనిపించకపోవడంతో పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు.